చలం ఆత్రంగా వాచీ చూసుకున్నాడు. టైమ్ పదిగంటలు! నిన్న డిసైడ్ చేసుకున్నట్లుగా ఈరోజు ఆ పని పూర్తిచేయాలి అనుకున్నాడు.

తేలు కుట్టిన దొంగలు

అయిదు నిమిషాలలో తయారయ్యి ఆఫీసుకు బయల్దేరాడు. స్కూటర్ స్టార్ట్ చేస్తొంటే సురేష్ కనిపించాడు బయటినుంచి క్రికెట్ బాట్‌తో వస్తూ.

"ఏంరా ఈరోజు స్కూలుకి వెళ్ళలేదా?" అడిగాడు కొడుకుని.

"ఈరోజు స్కూల్ లేదు డాడీ. స్కూల్‌లో డ్రాయింగ్ కాంపిటేషన్ ఉంది. నేను పాల్గొనాలంటే యాభై రూపాయిలు కట్టాలిట" సురేష్ చెప్పాడు.

"ఇదుగో తీసుకో" అని కొడుకు చేతికి యాభై అందించాడు సంభాషణ కొనసాగించడం ఇష్టంలేక.

బండిని ఆఫీసు వైపునకు కాక తన స్నేహితుడు చంద్రం ఇంటివైపు పోనిచ్చాడు. తలుపులు తీసే ఉండటంతో లోపలకి దూరి "ఏంరా? ఇంకా తయారుకాలేదా? ఎప్పుడూ నువ్వు లేటేరా" అన్నాడు.

"మా ఆవిడ కూడా ఇంట్లో లేదు కదా? అందుకనే అన్ని పనులూ నేనొక్కడినే చేసుకోవడంతో లేటైంది. ఇంకో పది నిముషాలలో తయారవుతాను కూర్చో" అని చెప్పి చంద్రం తయారయ్యాడు.

"ఏంరా! నిన్న అనుకున్న సినిమాకేనా? లేక మార్చావా?" అడిగాడు చలం.

"లేదురా ఈరోజు పేపరు చూస్తుంటే కనిపించింది



ఒక ఇంగ్లీషు సినిమా. మాంచి రొమాంటిక్‌గా ఉంటుంది" అన్నాడు చంద్రం.

వాళ్ళిద్దరూ ఎవరింట్లో భార్య ఊరికి వెళ్తే వాళ్ళు రెండో వారిని సినిమాకి తీసుకెళ్లడం ఆనవాయితీగా అలవరచుకున్నారు.

"సరేలేరా. ఈసారి నీ వంతు కదా. నీ ఇష్టం" అన్నాడు చలం.

ఇద్దరూ బయల్దేరి సినిమా హాలు చేరుకున్నారు నెమ్మదిగా. సరిగ్గా సినిమా ప్రారంభమవుతోంది. చీకట్లో నెమ్మదిగా తమ సీటు నంబర్లు వెతుక్కొని కూర్చున్నారు.

"నీ సెలక్షన్ భలేగా ఉందిరా. ఇంతకుముందు ఇన్ని సీన్లు చూసుండం కదరా" అన్నాడు చలం.

"నిజమేరా ఇప్పటివరకూ మనం చూసిన సినిమాలన్నీ ఒక ఎత్తు. ఈ సినిమా ఒక్కటీ ఒక ఎత్తు" అనుకుంటూ ఒకదాని తర్వాత ఒకటిగా సీన్లు చూసి ఎంజాయ్ చేస్తున్నారిద్దరూ.

తమలాగే ప్రక్కనున్న వాళ్ళిద్దరూ కూడా ఎంజాయ్ చేస్తున్నట్టుంది. కానీ వాళ్ళు స్టూడెంట్స్‌లా ఉన్నారే అనుకున్నారు. కొంతసేపటికి 'విశ్రాంతి' సమయం కావడంతో లైట్స్ వెలిగాయి.

ఒక్కసారిగా ప్రక్కసీట్ల వాళ్ళని చూశారేమో. వాళ్ళు తెల్లమొహాలేసుకున్నారు. వాళ్ళు వీళ్ళ సుపుత్రులే.

కొడుకులూ, తండ్రులూ మొహమొహాలు చూసుకుంటూ సినిమా పూర్తి కాకుండానే బయటపడ్డారు.

ఇంటికి వచ్చినా చలం కాని, చంద్రం కాని కొడుకులని నిలదీయలేకపోయారు. అలా చేయటం వల్ల తమ తప్పులను తామే బయట పెట్టినట్టవుతుందనుకున్నారు.

ఆనాటినుండి పిల్లలలో మార్పు వచ్చిందో లేదో కానీ ఆ తండ్రులు మాత్రం ఇలాంటి ఆనవాయితీకి స్వస్తి చెప్పారు.

-వుప్పటేవు శ్రీనివాసరావు (హైదరాబాద్)

పిన్నిగారిల్లు

ఆ వీధిలో కొత్తగా దిగారు సుబ్బారావు దంపతులు. ట్రాన్స్‌ఫర్‌ల మీద ఊళ్లు తిరగటం వాళ్ళకి అలవాటే. సుబ్బారావు భార్యపేరు కమల. ఇద్దరు ఆడపిల్లలు వాళ్ళకి.

కమల కొంచెం చలాకీ పిల్ల, ఎవరితోనయినా ఇట్టే కలసిపోగలదు.

సామాన్లు సర్దే పని వుండటం వలన సుబ్బారావు ఆఫీసుకి శెలవుపెట్టి ఇంటిదగ్గరే వున్నాడు.

కమలకి ఆ వీధిలో వున్న జానకితో పరిచయమైంది. వరుసలు కూడా కలిపి జానకిని పిన్ని అని పిలుస్తుంది.

అక్కడనుంచి సుబ్బారావు రోజూ ఆర్.టి.సి బస్సు మీదే ఆఫీసుకు వెళుతున్నాడు.

కమలకి కోరికలెక్కువ. సినిమాలకు, షికార్లకు తిరగాలనే కోరిక. సుబ్బారావు అందుకు వ్యతిరేకం. ఇప్పటి నుంచి జాగ్రత్తగా వుంటే తప్ప, భవిష్యత్‌లో ఇబ్బంది అవుతుందని అతని ఆలోచన.

ఒకరోజు "ఏమండీ, మీ ఆయనకి స్కూటరు లేదా అని అడిగిందండి జానకి పిన్నిగారు, నాకైతే సిగ్గేసిందండీ" అంది కమల.

"మన పరిస్థితులు మీ పన్నిగారికేం తెలుసు, ఉన్న వాళ్ళు అలాగే మాట్లాడతారు" చిరుకోపంతో అన్నాడు సుబ్బారావు.

ఆ వీధిలో జానకి, కమల మంచి స్నేహితులైపోయారు. జానకి ఖాళీ దొరికినప్పుడల్లా కమల ఇంటి కొచ్చి కూర్చుంటుంది. ఆ వీధిలో తతిమావాళ్ళకి వీళ్ళిద్దరి మీద కొంత అసూయ ఏర్పడింది.

ఒకరోజు " మీకు వాషింగ్ మిషన్ లేదా?" కమల ఇంటికొచ్చిన జానకి అడిగింది.

"లేదండి పిన్నిగారు" ముక్తసరిగా సమాధానం చెప్పింది కమల.

"ఈరోజుల్లో వాషింగ్ మిషన్, గ్రైండర్, మిక్సీ లేకుండా ఎవరైనా ఉంటారా?" హేళన కన్పించింది జానకి మాటల్లో.

చిన్నబుచ్చుకుంది కమల. టీ, టిఫిన్ అయిన తరువాత అక్కడనుంచి వెళ్ళిపోయింది జానకి.

ఆఫీసు నుంచి వచ్చిన సుబ్బారావు, కమల మౌనంగా వుండటం గమనించాడు. కమల చెవిలో జానకి ఏదో ఊదివుంటుందనుకున్నాడు.

రోజులు దొర్లుతున్నాయి.

ఒకరోజు "ఏమండీ! జానకి పిన్నిగారు మనల్ని వాళ్ళింటికి రమ్మన్నారండీ " చెప్పింది కమల.

"అలాగే, ఆదివారం వెళ్దాం" అన్నాడు సుబ్బారావు. ఆదివారం రానే వచ్చింది. సుబ్బారావు, కమల జానకి ఇంటికి బయలుదేరారు.

వాళ్ళను చూసి "రండి, రండి" అంటూ లోపలకు రమ్మంది జానకి. లోపలికొచ్చిన తరువాత కూర్చోమంది. కుర్చీలు రెండు దుమ్ము పట్టుకుపోయి వున్నాయి. చెరో గ్లాసు మంచినీళ్ళు యిచ్చింది.

"పిన్నిగారు, ఫ్రిజ్‌లో నీళ్ళు యివ్వలేకపోయారా?" చనువుగా అంది కమల.

"ఆ..ఆ..ఫ్రిజ్ రిపేరయింది" నీళ్ళు నములుతూ అంది జానకి. ఇంతలో పన్నెండు సంవత్సరాల కుర్రవాడు రెండు టిఫిన్ పేకెట్‌లు తెచ్చి జానకికి ఇచ్చాడు.

"ఏం పిన్నిగారు గ్రైండర్, మిక్సీలాంటివి వున్న మీరు బయట టిఫిన్‌లు తింటున్నారు" కొంచెం అనుమానంగా అంది కమల.

"ఆ..ఆ..రిపేరయితేను" మళ్ళీ నెమ్మదిగా అంది జానకి.

సుబ్బారావుకి సీను అర్థమైపోయింది. కమల తికమక పడుతోంది.

జానకి దగ్గర శలవు తీసుకొని ఇంటికి బయలుదేరారు ఇద్దరు.

కమల ఆరోజంతా సుబ్బారావు ముఖం చూడలేకపోయింది.

-వైదా ఈశ్వరరావు (మిందిి)